
క్లుప్తంగా

శ్రీరామనవమి శుభాకాంక్షలు



మల్లాది విష్ణు, ఎమ్మెల్యే

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాముని జీవితం తరతరాలకు ఆదర్శప్రాయమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలందరికీ బుధవారం ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఏటా వసంత రుతువులో చైత్రశుద్ధ నవమి రోజు వైభవంగా జరిగే శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రామరాజ్యం తరహాలో మంచి పాలన అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి శక్తిని ప్రసాదించాలని, రాష్ట్ర ప్రభుత్వానికి రాముల వారి ఆశీస్సులు లభించాలని ప్రార్థించారు. నియోజకవర్గ ప్రజలందరికీ శుభాలు కలిగేలా శ్రీసీతారాముల ఆశీస్సులు నిండుగా లభించాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రేపటి నుంచి శాస్త్రీయ సంగీతోత్సవాలు

విజయవాడకల్చరల్: స్వరఝరి 35వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు శివరామకృష్ణ క్షేత్రంలో శాస్త్రీయ సంగీత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మల్లాది శివానంద యశస్వి గాత్రం, శనివారం కొమ్మాజోస్యుల అలేఖ గాత్రం, ఆదివారం వయోలిన్ విద్వాంసుడు ద్వారం దుర్గాప్రసాద్‌కు చింతలపాటి లక్ష్మి స్మారక పురస్కారం అందిస్తామన్నారు. దుర్గాప్రసాద్ వాయిలీన సంగీత కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపునకు అవకాశం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నులను నగర వాసులు సెలవు రోజుల్లోనూ చెల్లించేందుకు అవకాశం కల్పించామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం శ్రీరామనవమి సందర్భంగా సెలవు ఉన్నందున పన్ను చెల్లింపుదారులకు అనువుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నగదు చెల్లింపు కౌంటర్లు పని చేస్తాయన్నారు. నగరపాలక సంస్థ మూడు సర్కిల్స్ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం నగదు వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆస్తి, నీటి, ఖాళీ స్థలం పన్నులు, డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించి నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

వయ్యారిభామ మొక్కల నిర్మూలన

పటమట(విజయవాడతూర్పు): వయ్యారి భామ కలుపు మొక్కలను నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిర్మూలించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఉత్తర్వుల మేరకు 'వయ్యారి భామ - కలుపు మొక్క నిర్మూలన' కార్యక్రమన్ని నగర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. వయ్యారి భామ కలుపు మొక్క, దాని పుప్పొడి ఆస్తమా, చర్మ వ్యాధులతో పాటు వాయు కాలుష్యానికి కూడా కారణమవుతుందని చెప్పారు. ప్రజారోగ్య దృష్ట్యా వాటిని నిర్మూలించాలని పేర్కొన్నారు. నగరంలోని 64 డివిజన్లలోని నివసేతర ప్రాంతాల్లో, ఖాళీ ప్రదేశాల్లో నిరుపయోగంగా పెరుగుతున్న వయ్యారి భామ కలుపు మొక్కలను వేరులతో సహా తొలగించి కాల్చేయాలని తెలిపారు.

ఈవెంట్స్ నిర్వాహకుడి ఆత్మహత్య



రత్నాకర్ మృతదేహం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్యాటరింగ్, ఈవెంట్స్ నిర్వాహకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన భవానీపురం స్టేషన్ పరిధిలోని విద్యాధరపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన వేమల రత్నాకర్ (26) నాలుగేళ్లుగా శ్రీనివాస కేటరర్స్ నిర్వహిస్తున్నాడు. ఏడాది కాలంగా ఈవెంట్స్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఓ యాంకర్‌తో పరిచయం ఏర్పడింది. ఈవెంట్స్ ద్వారా వచ్చే డబ్బు ఇంటిలో ఇవ్వడం లేదు. అప్పులు ఎక్కువై ఇంటిలో ఉన్న బంగారు నగలు బ్యాంక్‌లో తాకట్టు పెట్టాడు. కొద్ది రోజుల క్రితం ఈవెంట్స్‌లో యాంకర్‌గా పని చేస్తున్న యువతి రత్నాకర్ ఇంటికి వెళ్లి గొడవ పడింది. ఈ క్రమంలో రత్నాకర్ మంగళవారం గుంటూరు వెళ్లి ఇంటికి వచ్చి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తలుపుతీసి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. స్థానిక హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. రత్నాకర్ ఉరి వేసుకున్న గదిలో టేబుల్ పై ఉన్న పుస్తకంలో యాంకర్ పేరు రాసి ఉందని, చివరిసారిగా ఫోన్‌లో ఆమెతోనే మాట్లాడడన్నారు. తన కుమారుడు బలవన్మరణానికి యాంకర్ కారణమని రత్నాకర్ తండ్రి శ్రీనివాసరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసరాతో మహిళలకు ఆర్థిక భరోసా



డ్వాక్రా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్ లక్ష్మీపతి

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆసరా పథకంతో మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. మధురానగర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని అక్కా, చెల్లెమ్మలకు ఆసరా పథకం చెక్కులను డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల్లో ఆర్థిక చైతన్యం తీసుకువచ్చేందుకు ఆసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. తొలుత దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ పెనుమత్స శిరీష, లబ్ధిదారులు

విష్ణు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా సంఘాల సభ్యులను మోసం చేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఎన్నికల నాటికి ఉన్న రుణ మొత్తాన్ని రాజకీయాలకు అతీతంగా విడతల వారీగా డ్వాక్రా మహిళల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నామన్నారు.

136 గ్రూపులకు రూ.1.07 కోట్లు

29వ డివిజన్‌లో 136 గ్రూపులకు చెందిన 1350 మంది మహిళలకు రూ.కోటి 7 లక్షల 68 వేల 166 లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఆసరాతో పాటు చేయూత పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు తోడ్పాటు అందిస్తున్నామని చెప్పారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం ఒక సంక్షేమ క్యాలెండర్‌ను ఏర్పాటు చేసి మరీ సంక్షేమం అందిస్తున్న ఏకైక సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సృజన, వైఎస్సార్ సీపీ నాయకులు కంభం కొండలరావు, ఎస్‌కే బాబు, గోవిందు, కె.రమేష్, అక్బర్, శనగశెట్టి హరిబాబు, పాలకోటి దుర్గాంబ, ఉద్దంటి సురేష్, నాగమణి, పూర్ణిమ, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ధ్యేయంగా పాలన

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడులో బుధవారం సాయంత్రం వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని అక్కా చెల్లెమ్మలకు ఆసరా పథకం చెక్కులను కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డివిజన్‌లో 108 గ్రూపుల్లోని 1,077 డ్వాక్రా సభ్యులకు రూ.80 లక్షలను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల ఆర్థిక స్వావలంబన ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పారు. తొలుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సృజన, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు సామంతపూడి చిన్నా, పెనుమత్స సత్యం, పి.పట్టాభిరామరాజు, బెజ్జం రవికుమార్, కె.వెంకటేశ్వరరావు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలం

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విశ్వబ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండాలని, అప్పుడే అనుకున్నదేదైనా సాధించగలమని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. గొల్లపూడి పరిధిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల తన కార్యాలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలను చేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర సంఘం ద్వారా సంఘీయులందరికీ భరోసా కల్పించే పనులు చేయాలని కోరారు. ప్రభుత్వం బీసీలకు పెద్ద పీట వేసి అందిస్తున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో రాష్ట్ర నాయకులు రాష్ట్రవ్యాప్తంగా భారీ సమావేశాలను ఏర్పాటు చేయాలని, గ్రామ స్థాయి నుంచి సంఘ కమిటీలను నియమించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాలను ఆధునీకరణ చేయాలని కోరారు. శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠానికి విజయవాడ నుంచి బస్ సౌకర్యం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి గ్రామంలో



సంఘీభావం తెలుపుతున్న శ్రీకాంత్, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

రుద్రభూముల కోసం ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించారు. రాష్ట్ర సంఘానికి మూల ధనం ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా సంఘీయులకు సేవా కార్యక్రమాలను చేపట్టాలని తీర్మానించారు. విశ్వబ్రాహ్మణుల సమస్యలపై ప్రభుత్వ పెద్దలను, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి విన్నవించాలని తీర్మానించారు. సమావేశంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చేవూరి రామస్వామి, ప్రధాన కార్యదర్శి గోకవరపు శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి ఆశ్లేషాచారి, రాష్ట్ర నాయకులు బి.ఉమామహేశ్వరరావు, చేవూరి రమేష్, ఎం.ప్రసాద్, జి.కె.ఆనంద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే పరమావధిగా పాలన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్నట్లు ఏపీ ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 29వ డివిజన్‌లో రూ.68 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజల అవసరాల మేరకు తోట కేదారేశ్వరరావు వీధిలో రూ.30 లక్షలు, రామాలయం వీధిలో రూ.28 లక్షలు, నేతాజీ రోడ్డులో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల పునరుద్ధరణ పనులకు శంకు



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

స్థాపన చేస్తున్నామని చెప్పారు. పనులను నిర్ణీత సమయంలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు-2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయా పోస్టులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ జి.మంగమ్మ ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రాజెక్టు -2 పరిధిలోని 11వ డివిజన్ జార్జిపేటలో అంగన్‌వాడీ కార్యకర్త ఓసీ కేటగిరి, 2వ డివిజన్ మనవరం -1 నందు ఎస్సీ కేటగిరి, 14వ డివిజన్ శ్రీనివాస్ నందు ఓసీ కేటగిరి, 16వ డివిజన్ మధురానగర్ బీసీ -డి కేటగిరి, 17వ డివిజన్ ద్వారకానగర్ నందు ఎస్టీ కేటగిరి, రాణిగారి తోట-2 నందు ఓసీ కేటగిరి, 22వ డివిజన్ డ్రైవర్ పేట-2 నందు బీసీ-బి కేటగిరికి కేటాయించామన్నారు. గొల్లపూడి, రామవరప్పాడు నందు ఓసీ కేటగిరి అభ్యర్థులకు అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులను కేటాయించడం జరిగిందన్నారు. ప్రసాదంపాడు -8 నందు మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త, మినీ అంగన్‌వాడీ పోస్టులకు 21 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణత పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. వివాహితురాలై స్థానికంగా ఉండాలన్నారు. దరఖాస్తులను ఏప్రిల్ 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పెనమలూరు మండలం కానూరు కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలని మంగమ్మ కోరారు.

● సొంతూరికి పయనం



ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా సొంతూరికి పయనమయ్యారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆర్టీసీ బస్టాండ్‌కు రావడంతో బస్టాండ్ ప్రాంగణంలో రద్దీ నెలకొంది. విద్యార్థులు తమ స్నేహితులకు వీడ్కోలు పలికి స్వగ్రామాలకు బయలుదేరి వెళ్లారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నేటి నుంచి శ్రీమత్ రామాయణ ప్రవచన సప్తాహం



కృష్ణలంక(విజయవాడతూర్పు): ధర్మ ప్రచారంలో భాగంగా రాణిగారితోటలోని శ్రీ కోదండ రామాలయంలో టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్, ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో శ్రీమత్ రామాయణ ప్రవచన సప్తాహం ఏర్పాటు చేయడం సంతోషకరమని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో సప్తాహం కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడపా శేషు మాట్లాడుతూ.. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం నుంచి ఏడు రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు ప్రవచన సప్తాహం జరుగుతుందన్నారు. విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం అనంతరం ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలచే శ్రీమత్ రామాయణంలోని వివిధ అంశాలపై ప్రవచనాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార మండలి సభ్యులు తన్నీరు పుల్లారావు, నండూరి వెంకట తాండవ కృష్ణ, ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ సి.వి.కె.ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడంలో విద్యార్థులు చైతన్యవంతులు కావాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) భవానీపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ కోరారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని శ్రీఅలిగినేని పెద ముత్తయ్య జెడ్పీపీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సదస్సుల్లో శ్రీనివాస్ మాట్లాడారు. గంజాయి లేదా మాదక ద్రవ్యాల విక్రయం, కొనుగోలు, అక్రమ రవాణాకు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా వెంటనే తమకు గానీ, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లోగానీ తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారు పేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకే ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు పోలీసులతో చేతులు కలిపి విజయవాడ నగరాన్ని మాదక ద్రవ్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని కోరారు. డ్రగ్స్ వినియోగంతో నేర ప్రవృత్తికి అలవాటు పడతారన్నారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సదస్సులో పాఠశాల హెచ్ఎం ఎస్.కమలాకరరావు, ఎంఎస్‌కేలు వి.అరుణకుమారి, కేబీఎస్ జ్యోతి పాల్గొన్నారు.

అరుణహోమం సర్వ శ్రేయోదాయకం



హోమం నిర్వహిస్తున్న దెందుకూరి సుబ్రహ్మణ్యం, రుత్వికులు

విజయవాడకల్చరల్: అరుణ హోమం సర్వ శ్రేయోదాయకమని దెందుకూరి సుబ్రహ్మణ్య ఘనాపాటి అన్నారు. శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రం(రామకోటి)లో భారతీ తీర్థ మహాస్వామి 73 జన్మదిన వేడుకల సందర్భంగా 73 రోజులుగా నిర్వహిస్తున్న సూర్యార్చన, మహాసౌరం అరుణం, సౌరాక్షరీ మంత్ర జపం, సూర్య నమస్కారాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు కార్యక్రమంలో లోక శాంతి, ఆయు ఆరోగ్యం కోసం అరుణహోమం నిర్వహించారు. హోమాన్ని ప్రారంభించిన అనంతరం సుబ్రహ్మణ్య ఘనాపాటి మాట్లాడుతూ.. సూర్యాహోమంతో దీర్ఘకాలిక రోగాల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విదుశేఖర భారతి స్వామి సూచనతో కార్యక్రమం నిర్విఘ్నంగా నిర్వహించినట్లు తెలిపారు. రుత్వికులు వైభవంగా వేదస్వస్తి, గురు వందనంతో ప్రారంభించి ఆగమ యుక్తంగా అరుణ హోమం జరిపారు. శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్, సభ్యుడు గండూరి చంద్రమౌళీశ్వర శర్మ రుత్వికులను సత్కరించారు.

సీతారాముల కల్యాణోత్సవాలకు సర్వంసిద్ధం



బీసెంట్ రోడ్డులో కల్యాణోత్సవానికి ఏర్పాటు చేసిన చలువ పందిరి



దేవీనగర్‌లో కల్యాణోత్సవానికి సిద్ధం చేసిన మండపం



మాచవరం డౌన్‌లో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వంసిద్ధమైంది. ముత్యాలంపాడు, మధురానగర్, మాచవరం, దేవీనగర్, రామకృష్ణాపురం, అయోధ్యనగర్, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే సీతారామ కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. అలాగే ఆలయాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. సీతారాములను దర్శించుకునేందుకు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశారు.

పలు ప్రాంతాల్లో..

దేవీనగర్ శ్రీ కోదండ రామాలయంలో గురువారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.వీరరాజు, గంగిశెట్టి సాంబశివరావు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం, శనివారం సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం, పవళింపు సేవ జరుగుతుందన్నారు. 2వ తేదీన అన్నప్రసాద వితరణతో ఉత్సవాలు ముగుస్తాయి. సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మాచవరం డౌన్ చెరుకూరి రామబ్రహ్మం వీధిలో 13వ శ్రీసీతారాము కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. గురువారం నుంచి 9 రోజుల పాటు సీతారాముల కల్యాణోత్సవాలను కనులపండువగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కంచర్ల రాము తెలిపారు. మధురానగర్ శ్రీ కల్యాణ రామాలయంలో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

నేడు భవానీ ద్వీపంలో...

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక పర్యాటకం(రెలిజియస్ టూరిజం) ప్రమోషన్‌లో భాగంగా గురువారం భవానీ ద్వీపంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీతారాముల కల్యాణం జరుగుతుందన్నారు. అనంతరం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మహిళలతో కోలాటాలు, కూచిపూడి నృత్యం, ఆంధ్రా శివమణిగా పేరొందిన మాస్టర్ చెర్రీ డ్రమ్స్ షో, జానపద డప్పు కళాకారుల విన్యాసాలు, జానపద నృత్యాలు తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం స్వామివార్ల ఉత్సవమూర్తులతో ఊరేగింపు, శ్రీరాములవారి పవళింపు సేవ జరుగుతుందన్నారు. పర్యాటకులు సాధారణ బోటు చార్జీలతోనే ఈ మహోత్సవంలో పాల్గొనవచ్చని కోరారు.

దాసాంజనేయ దేవాలయంలో..

మాచవరం దాసాంజనేయసామివారి దేవాలయంలో సీతారాముల కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని తెలిపారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

● ఉత్సాహంగా గడప గడపకు..



63వ డివిజన్ 278వ సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జరిగింది. ఎమ్మెల్యే విష్ణు పాల్గొని ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించి నూతన ఆవిష్కరణలు చేయాలని సబ్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. మాంటిస్సోరి కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆఫ్ ఫిజియోథెరపీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్ కలెక్టర్ అదితిసింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులు కొత్త ఆలోచనలు చేయాలని సూచించారు. రోగులతో ప్రేమగా మెలగాలన్నారు. ప్రిన్సిపాల్ వరదరాజన్ మాట్లాడుతూ.. లక్ష్యాలు ఏర్పరచుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అవిర్నేని రాజీవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు డ్యాన్స్‌లు, ఫ్యాషన్ షోలతో సందడి చేశారు.

నేత్రపర్వంగా గజవాహన సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ కొత్తగుళ్ల ప్రాంగణంలో వేం చేసి ఉన్న శ్రీ కోదండ రామ స్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి గజవాహన సేవ బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం గజవాహన సేవను వైభవంగా నిర్వహించారు. అలాగే స్వామి వారి వివాహ వేడుకలను పురస్కరించుకొని ఎదుర్కోలోత్సవాన్ని జరిపారు. కమిటీ ప్రముఖులు పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను పులిపాక ఆంజనేయాచార్యులు రాఘవాచార్యులు నిర్వహించారు.

కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామస్వామి వార్ల దేవస్థానంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అగ్నిప్రతిష్టాపన, వాస్తుహోమం, భేరిపూజ, ధ్వజపట ప్రతిష్ట, ధ్వజారోహణాది కార్యక్రమాలను చేపట్టారు. ధ్వజారోహణం ద్వారా ఆదిదేవుడైన శ్రీరామచంద్ర ప్రభువు వివాహానికి సకల దేవతా మూర్తులను పండితులు ఆహ్వానించారు.